# జయ జయ వైష్ణవి దుర్గే

- వర్ధని శ్రీకాంత్.

ప్రాచీన కాలము నుండి కూడ స్త్రీ శక్తిని దైవస్వరూపముగా కొలిచి, పూజించటము అనేది మనకు సనాతన హైందవ ధర్మమునందు అనేక దృష్టాంతములుగా చూపబడినది. దీనికి ఒక ఉదాహరణగా : "ప్రకృతి మాత" అనేది ఉవాచ కదా! మరి ప్రకృతిని స్త్రీ రూపంలో పోల్చడంలోని ఉద్దేశ్యం ఏమనగా - సకల జీవరాశుల మనుగడకు మూలశక్తి స్త్రీ మూర్తి, అలాగే పచ్చని సుఖజీవనాహ్లాదాన్ని అందించేది భూమాత, కాలభ్రమణంలో వినాశనము తర్వాతి పునరుత్పత్తికి హేతువు మాతృరూపమే అని దీనియందు గల సూక్ష్మము.



అందుకే "మాతృదేవోభవ" అన్నది వేదప్రవచనము. జగత్తునందు మాతృస్వరూపము అత్యున్నతము, సాక్షాద్భగవత్స్వరూపము. అఖిల చరాచర మాతృ రూప సహజసిద్ధ వాత్సల్యభావమే భగవద్భక్తికి ఆలంబనగా, అవ్యక్త, నిశ్చల, భక్తి తత్వమునకు ప్రేరణగా ప్రస్ఫుటమవుతోంది. సమకాలీన సిద్ధాంతముననుసరించి చూచినా, సమస్త జీవరాశుల జననం, ఉనికి అంతా అండ, పిండ, గర్భస్థ ఆధారమన్న సత్యాన్ని ప్రకాశించునట్లుగా, ఆ తల్లిని కీర్తిస్తూ, "జగదాధారనిలయ", "సృష్టిస్థితితిరోధాన సంకల్పిత", "ఆద్యంతరహిత" అని లలితా రహస్యనామస్తోత్రం ప్రవచిస్తోంది.

## అష్టాదశ పీఠములు - వివరణ :

సర్వార్ధ శక్తి, సర్వాంతర్యామి, అనంతప్రేమవాహినియైన ఆ త్రిపురశక్తి భారతదేశమునందు అష్టాదశ (18) పీఠములయందు వెలిసినట్లుగా ఈ క్రింది శ్లోకము విశదీకరిస్తోంది.

ఆ సేతు హిమాచలంగా అన్ని రాష్ట్రములలో మరియు శ్రీలంక దేశములో ఈ 18 పీఠములు ప్రతిష్ఠితమైయున్నవి.

లంకాయాం శాంకరీదేవి, కామాక్షి కంచికాపురీ
ప్రద్యుమ్నే శృంగళాదేవి, చాముండే క్రౌంచపట్టణే
అలంపురీ జోగులాంబ, శ్రీశైలే భ్రమరాంబికా
కొల్హాపురీ మహాలక్ష్మి, మాహుర్యే ఏకవీరికా
ఉజ్జయిన్యాం మహాంకాళీ, పీఠికాయాం పురుహూతికా
ఓఢ్యాయాం గిరిజాదేవి, మాణిక్యే దాక్షవాటికా
హరిక్షేత్రే కామరూపీ, ప్రయాగే మాధవేశ్వరీ
జ్వాలాయాం వైష్ణవీదేవి, గయా మాంగళ్యగౌరికా
వారణాస్యాం విశాలాక్షి, కాశ్మీరేతు సరస్వతీ
అష్టాదశ పీఠాని, యోగినాం అతి దుర్లభం
సాయంకాల పఠేన్నిత్యం, సర్వశత్రువినాశనం
సర్వవ్యాధిహరం రోగం, సర్వ సంపత్కరం శుభం ||

ఈ అష్టాదశ పీఠములు కాక ఈ క్రింద పేర్కొన్నవి కూడా జ్ఞానశక్తి పీఠములుగా విశేష ప్రాముఖ్యతను కలిగియున్నవి. ఆ అవతారమూర్తుల వివరణ ఈ క్రింది విధముగా ఉన్నది.

**1. కామాఖ్యశక్తిపీఠం** : తాంత్రిక విద్యల, పూజల సాధనాకేంద్రంగా ప్రఖ్యాతి చెందిన ఈ పీఠం అస్సాంలోని గౌహతీ నగరానికి చేరువలో నీలాచల్ పర్వతంపై వెలసియున్నది. ఈ దేవాలయమును "కామదేవుడు" నిర్మించాడని, సంతన ప్రాప్తికై స్త్రీలు ఇక్కడికి వచ్చి పూజిస్తారని ప్రతీతి. శ్రీ ఆదిశంకరాచార్యులవారు ఈ పవిత్ర క్షేత్రానికి వచ్చి కామాఖ్యదేవిని ఆరాధించారు.

**2. శృంగేరి శారద పీఠం** : వాగదీశయై, పావన తుంగా తీరాన శృంగేరి పీఠం అధిదేవతగా, దక్షిణ భారతదేశాన, వేదశాస్త్రాగమన సభాపురోగతితో సాగుతూ, అవతారమూర్తియైన శారదాదేవిగా కొలువుదీరియున్నది.

**3. మధురమీనాక్షి** : దక్షిణ భారతమున, తమిళనాడు రాష్ట్రంలో పాండ్యరాజుల కాలంలో, స్వామి సుందరేశుని అర్ధాంగియై అలరారుతూ, అత్యద్భుత శిల్పకళా సౌందర్యముతో భాసించెడి మధుర దేవాలయమున నెలకొనియున్నది.

**4. కన్యాకుమారి** : భారతదేశమునకే "మణి మంజీరమయమా" అన్నట్లుగా మూడు లోకాలను శాసించే దేవతామూర్తి, కన్యారూపధారణియై మూడు సముద్రముల నడుమ స్థానములో, త్రికోణాంతరదీపికగా పూజలందుకొంటున్నది.

**5. బెజవాడ కనకదుర్గ** : అఖిలాంధ్ర జనుల ఆరాధ్యదేవతగా, కల్పవల్లియై, కృష్ణానదీ తీరాన, ఇంద్రకీలాద్రిపై నెలకొన్న సింహవాహిని "కనకదుర్గ", "విజయదుర్గ", అమ్మలగన్న అమ్మగా అవతరించి, ఆ పురజనులను కాపాడుతోందని ప్రతీతి.

**6. వాసరక్షేత్రము** : దక్షిణ పీఠభూమికి చేరువలో పవిత్ర గోదావరీ తీరాన వాసర క్షేత్రంలో "జ్ఞాన సరస్వతీ" రూపమున విలసిల్లుతోంది. ఇది ఆదిలాబాద్ జిల్లాలోని "బాసర్" అన్న గ్రామమునందు వెలసినది.

**7. కాళీఘాట్** : బెంగాల్ రాష్ట్రమున కలకత్తా (నేటి కోలకొటా) నగరమున, అపర కాళికామాతగా, రామకృష్ణ పరమహంస, వివేకానందుని వంటి యోగపుంగవులను చైతన్య, మోక్షసాధనా మార్గమున పయనించే భాగ్యమును అనుగ్రహించినది.

**8. వైష్ణవి - కట్రా** : ఉత్తర భారతమున, జమ్మూ రాష్ట్రములో హిమాచలపర్వతములపై వెలసి, సకల భక్తుల మనోరథములీడేరుస్తోంది.

## దేవీవర్ణన - నవరాత్రుల విశేష్యత :



ఆదిశక్తి, జగదాధారిణి, శక్తి, జ్ఞాన స్వరూపిణియైన ఆ దేవి అవతారములే దుర్గ, కాళి, లక్ష్మి, సరస్వతి, చండి, అంబిక, ఉమ, అన్న నామాంతరములతో విలసిల్లుచున్నారు. ఇక "గాయత్రి" అవతార మహిమ జగద్విదితము. "త్రిమూర్తి రూపా త్రైలోక్య సుమోహన తనుప్రభా" అని లలితా సహస్రనామావళిలో స్తుతిస్తాము. దీనిలోని అంతరార్థం : త్రిమూర్తి రూపములైన బ్రహ్మ, విష్ణు మహేశ్వరులు ఆ సూర్యభగవానుని మూడు అంశలుగా "త్రిసంధ్యలుగా" వెలుగొందుతున్నారు. అట్టి త్రైశక్తుల సమాహారమే దివ్య తేజోమయ కాంతి స్వరూపిణిగా, ఓంకారపంజరశుకియై ప్రభవించే "గాయత్రీ స్వరూపము". లలితాసహస్రంలోని ఇంకొక

శక్తి వర్ణనా వివరణ : "జయా జాలంధర స్థితా" - జలములను (దారములను) ధరించునది; దారములతో నిర్మితమగు పద్మమును ఆసనముగా కల్గినటువంటి అవతారమూర్తి, పద్మాసనస్థితయైన "లక్ష్మి స్వరూపిణి", సకల శుభ ప్రదాత, ఐశ్వర్యప్రాప్తిని అనుగ్రహించు స్వరూపిణి. "అన్నం పరబ్రహ్మ స్వరూపం" - సాక్షాత్తు పరబ్రహ్మ స్వరూపిణియై, మనకు "అన్నం" అనే జీవనాధార శక్తిని అనుగ్రహించే "అన్నపూర్ణ" కూడా దేవీ అవతారములలో ఒకటిగా ప్రఖ్యాతి చెందినది.

ఈ నవరాత్రులలో ఆ పరాశక్తిని నవ అలంకారములతో పూజిస్తారు. దుష్టసంహారిణిగా, అసురులను రక్తస్థితమయంగా నాశనం చేసి హారతులందుకొన్న ఆ దేవికి రుధిర వర్ణం (ఎరుపు రంగు) ఇష్టమైన రంగు. దీనిలో గల ధర్మసూక్ష్మం : మానవ దేహమునకు మూలకారకమైన అంతర్భాగంగా, సజీవ చేతనత్వానికి శక్తికి ప్రతీక ఈ వర్ణం. అందువల్లనే "చైతన్యార్థ సమారాధ్య చైతన్య కుసుమప్రియా" అని కీర్తించబడినది (లలితా రహస్యనామ స్తోత్రం). కనుక "నిజారుణ ప్రభాపూరితమై" వెలుగొందు ఆ దేవిని ఎఱ్ఱని ఆభరణములతో, ఎఱ్ఱని పూలతో, ఎఱ్ఱని వస్త్రములతో సదా అలంకరిస్తారు. ఆ అలంకారములే బ్రహ్మణి, వైష్ణవి, కౌమారి, శాకంబరి, శారద అను వివిధ నామములతో తొమ్మిది రోజులలో ఒక్కొక్క రూపధారిణిగా చెప్పబడినది. "పార్వతి లేదా లలితాదేవి" అని సౌమ్యమూర్తిగా, "కాళి" అని ఉగ్ర, రౌద్రమూర్తిగా, "దుర్గామాత" అని అనంత శక్తిమూర్తిగా వివిధ రీతుల నవరాత్రులలో కొలుస్తాము.

సంగీత వాగ్గేయ కారుడైన శ్యామశాస్త్రులవారు స్తుతించి పాడినట్లుగా, "కనకశైల విహారిణి అంబా కామాకోటి పీఠనివాసిని"యై, జగద్గురువులైన శంకర భగవత్పాదుల పాలిటి కామాక్షిరూపిణిగా, పరమహంస రామకృష్ణుని మోక్షప్రదాత "కాళీ మాతేశ్వరి"గా వివిధ రూపాల గోచరిస్తూ దయ, వాత్సల్యం, కరుణలతో భక్తుల కోరికలీడేరుస్తూ సమున్నత పీఠస్థయై నీరాజనాలందుకుంటోంది.

అందువలన, సర్వవేద స్వరూపితమైన అట్టి భగవతీ (స్త్రీ) మూర్తికి మన జీవితంలో సర్వవేళలా, సర్వదా, సమగ్రస్థానార్హతను కలిగించాలన్నది "నవరాత్రుల" పేరిట విశ్వమానవాళికి, హైందవ ధర్మశాస్త్రములందించిన నిగూఢ, మహత్తర సందేశము.

అయిగిరినందిని! నందితమోదిని! విశ్వవినోదిని! నందినుతే!
గిరివరవింధ్య శిరోధినివాసిని! విష్ణువిలాసిని! జిష్ణునుతే!
భగవతి! హే శితికంఠకుటుంబిని! భూరికుటుంబిని! భూరికృతే!
జయజయ హే మహిషాసురమర్దిని! రమ్యకపర్దిని! శైలసుతే!

ఓం శాంతి: శాంతి: శాంతి: